ఉష్ణోగ్రత (అంచనా)

23-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	26
తెనాలి	39	27
నరసరావుపేట	41	23
బాపట్ల	37	27
రెంటచింతల	42	23

మున్సిపాల్టీల్లో నిర్మాణాలను ప్రోత్సహించాలని.. ప్లాన్లకు అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. నిర్మాణ దారులకు ప్లాన్ అప్రూవల్ కష్టాలను తప్పించాలని.. ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేసింది. అయితే ఈ నిర్ణయం నిర్మాణదారులకు మేలు చేసేదిగా ఉన్నా తమకు కష్టాలు తెచ్చి పెడుతుందని లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లు(ఎల్‌టీపీ) వాపోతున్నారు. ప్లాన్లలో అతిక్రమణ జరిగితే ఎల్‌టీపీలను బాధ్యులు చేస్తూ సరికొత్తగా నిబంధనలు విధించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం వల్ల పట్టణంలో ప్రతి బిల్డింగ్ నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. తప్పు జరిగిందా యాజమాని, ప్లానర్‌పై ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ఈ పరిస్థితుల్లో ప్లాన్ అప్‌లోడు చేసి కష్టాలు తెచ్చుకోవడం ఎందుకనే భావనలో ఎల్‌టీపీలు ఉన్నారు. దీంతో గత నెలన్నరుగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీలో ఎల్‌టీపీల నుంచి ప్లాన్లు అప్‌లోడు కావడంలేదు. దీంతో నిర్మాణదారులు శంకుస్థాపనలు చేసుకుని ప్లాన్ల ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. మున్సి పాల్టీల్లో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాల ప్లాన్ల విషయంలో ప్రభుత్వం ఒకవిధంగా ఆలోచిస్తే అది మొదటికే నష్టం చేకూర్చిందన్న భావన అటు నిర్మాణ దారుల్లో.. ఇటు లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లలోనూ వ్యక్తమవుతోంది.

ప్లానిస్తే.. ప్లాట్లే





- లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లలో ఆందోళన
- మున్సిపాల్టీల్లో కొత్త నిబంధనలపై వ్యతిరేకత
- అతిక్రమణలపై కేసులతో ఎల్‌టీపీలు వెనుకంజ
- పట్టణాల్లో నెలన్నరగా దాఖలు కాని ఇంటి ప్లాన్లు
- ప్లాన్లు ఆమోదం కాక స్తంభించిన కొత్త నిర్మాణాలు

ఎల్‌టీపీలదే బాధ్యత..

ఎల్‌టీపీ అంటే.. ప్లాన్ గీయడం. అప్రూవల్ చేయించడంతో పని పూర్తి కాదు. నిర్మాణానికి సంబంధించి ఫౌండేషన్ నుంచి వివిధ స్థాయిల్లో ఫొటోలు తీసి సర్వర్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్లాన్‌తో పాటు దాఖలు చేసిన అన్ని ధ్రువపత్రాలు సక్రమమని ఎటువంటి తేడాలు లేవని నిర్ధారిస్తూ సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. ఇంత రిస్క్ చేసి ప్లాన్లు రూపొందించి ఇబ్బందులు ఎందు ర్కోలేమన్న వాదనను ఎల్‌టీపీలు వినిపిస్తున్నారు. అన్నీ పరిశీలించి ప్లాన్ తయారు చేయ డం కష్టతర మంటున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- గత 45 రోజులుగా నరసరావుపేట మున్సిపాల్టీలో ఇంటి ప్లాన్ కోసం ఒక్క దరఖాస్తు మా త్రమే దాఖలైంది.
- గత నెలన్నరుగా మున్సిపల్ పట్టణాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్ల నుంచి ఇళ్ల ప్లాన్ల దరఖాస్తులు అప్‌లోడు కావడంలేదు.

.. మున్సిపల్ పట్టణాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడంలేదా. ప్లాన్లకు ఆమోదం లభించిక పెండింగ్‌లో ఉంటున్నాయా. నిర్మాణ సామాగ్రి ధరలు పెరిగి ఎవరూ ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రావడంలేదా... అంటే కాదు. అసలు ప్లాన్లు గీసేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లు ధైర్యం చేయడంలేదు. ఒక వేళ గీసినా ఆ ప్లాన్లను వారు అప్‌లోడు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీల్లో ఇంటి ప్లాన్ల ఆమోదానికి సంబంధించి తీసుకొచ్చిన సరికొత్త నిబంధనలే దీనికంతటికీ కారణమని తెలుస్తోంది. పట్టణాల్లో ఇళ్ల నిర్మాణ ప్లాన్ల అనుమతులకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ ద్వారా ప్లాన్లను మంజూరు చేస్తోంది. ఇది భవన నిర్మాణదారులకు ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావించింది. అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని ప్రకటించింది. ప్రభుత్వ ఆశయం ఉన్నతంగా ఉన్నా.. కొత్త నిబంధనల మేర ప్లాన్ దాఖలు చేసేందుకు ఎల్‌టీ పీలు ససేమిరా అంటున్నారు. దీంతో మున్సిపాల్టీల్లో కొత్త నిర్మాణాలు స్తంభించిపోయాయి. గతంలో టౌన్ ప్లానింగ్ (మిగతా 8వ పేజీలో)



కొత్తపల్లి జంక్షన్‌లో అనధికార లేఅవుట్

భూ మాయగాళ్లు

- గత ప్రభుత్వంలో రూ.కోట్లు కొల్లగొట్టిన వైసీపీ నేతలు
- లేఅవుట్‌లో ప్రభుత్వ పోరంబోకు భూములు
- మాజీ ప్రజాప్రతినిధికి వాటా.. అధికారులకు మామూళ్లు

మాచర్లలో విచ్చలవిడిగా అనధికార లేఅవుట్లు

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మాచర్లలో అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.. పాలకుల ఆశీస్సులు, అధికారుల అండదండలతో వైసీపీ మూకలు విచ్చలవిడిగా రెచ్చిపోయాయి. ప్రభుత్వ భూములకు ప్రైవేటు భూములు జత చేసి అక్రమంగా లేఅవుట్లు వేశారు. అందిన కాడికి భూములను అమ్ముకొని అప్పనంగా కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. ఆశీస్సులు అందించిన అప్పటి ప్రజాప్రతినిధికి వాటాలు అందించి, అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి కోట్లకు పడగలెత్తారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా వైసీపీ భూ మాయగాళ్ల అక్రమ లేఅవుట్ల దందా మాత్రం ఆగలేదు..

మాచర్ల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ శివారులోని కొత్తపల్లి జంక్షన్‌లో సర్వే నంబరు 843లో 4 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఎకరన్నర రైల్వే పోరంబోకు కాగా, 50 సెంట్లు కుంట పోరంబోకు ఉంది. మిగతాది పట్టా భూమి. ఈ నాలుగు ఎకరాల్లో వైసీపీ నేతలు అక్రమంగా లేఅవుట్ వేశారు. అధికారులకు పెద్ద మొత్తంలో ముట్టజెప్పారు. సాఫీగా లేఅవుటు వేసి ప్లాట్లు విక్రయించారు. ఈ లేఅవుట్‌లో స్థలం కొన్న వారు కొందరు గృహ నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తున్నారు. క్రయ విక్రయాలు జరుపుతున్నారు.


కొత్తపల్లి జంక్షన్‌లోని టౌన్‌షిప్‌లో...

అలాగే కొత్తపల్లి జంక్షన్‌లోని ఓ టౌన్‌షిప్ సుమారు 40 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో సుమారు 3 ఎకరాలకు మాత్రమే అనుమతులు తీసుకున్నారు. ఆ లేఅవుట్‌లో దాదాపు 20 ఎకరాల్లో గృహ నిర్మాణాలు జరిపారు. అంతటితో ఆగక సుమారు 20 ఎకరాలలో అనధికారికంగా లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వీరి దందా మాత్రం ఆగడం లేదు.

సొసైటీ కాలనీలో...

పట్టణంలో ఉన్న సొసైటీ కాలనీలోని సాయిబాబా స్కూల్, స్విమ్మింగ్ పూల్ సమీపంలో అక్రమ లేఅవుట్ వేసి, సాఫీగా స్థలాలను విక్రయించారు. అలాగే సప్తగిరి టౌన్‌షిప్ సమీపంలో రెండు అక్రమ లేఅవుట్లు వేశారు. రాయవరం జంక్షన్‌లోని బైపాస్ సమీపంలోనూ రెండు లేఅవుట్లు వెలిశాయి. వినాయకుని గుట్టలో రెండు ఎకరాల్లో లేఅవుట్ వేశారు. రామప్ప దేవాలయం సమీపంలో కూడా నాలుగు ఎకరాల్లో అక్రమంగా లేఅవుట్లు వెలిశాయి. ఇవన్నీ వైసీపీ హయాంలో అనధికారికంగా వేసినవే. వీటికి సరైన అనుమతులు లేవు. వీరంతా వైసీపీకి చెందిన వారే. మాజీ ప్రజాప్రతినిధి అండదండలతో అక్రమార్జన చేశారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు తప్పవు



పట్టణంలో అనధికార లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే టౌన్‌షిప్, కొత్తపల్లి జంక్షన్, రాయవరం జంక్షన్ తదితర ప్రాంతాల్లో లేఅవుట్లు వేసిన వారికి నోటీసులు జారీ చేశాం.

- వేణుబాబు, కమిషనర్, మాచర్ల



కొత్తపల్లి జంక్షన్‌లోని ఎంఎస్‌ఆర్ టౌన్‌షిప్

రైల్వేకు బ్లాక్‌స్పాట్ల భయం

- గుంటూరు డివిజన్‌లో 290 చోట్ల ట్రాక్ అతిక్రమణ
- బ్యారికేడింగ్ లేకపోవడంతో ట్రాక్‌పైకి పశువులు, మనుషులు
- 110 కిలోమీటర్ల వేగంతోనే రైళ్ల రాకపోకలకు సేఫ్టీ కమిషనర్ అనుమతి



ట్రాక్ పక్కన పశువులను తోలుకెళుతున్న కాపరి

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రైల్వే ట్రాక్‌పైకి పశువులు, మనుషులు ఇష్టం వచ్చినట్లు వచ్చేస్తున్నారు. డివిజన్ మొత్తం మీద 290 చోట్ల ట్రాక్ అతిక్రమణలు జరుగుతున్నట్లు రైల్వే మెకానికల్ విభాగం గుర్తించింది. రైల్వేట్రాక్‌ల అతిక్రమణల కారణంగా రైళ్ల భద్రతకు ముప్పు వాటిల్లుతున్నది. పశువులను 110 కిలోమీటర్ల వేగంతో వెళుతున్న రైలు ఢీకొంటే లోకో(ఇంజిన్) దెబ్బతింటున్నది. అంతేకాకుండా పైలట్లు అత్యవసర బ్రేకులు వేస్తుండటంతో రైలు పట్టాలు తప్పే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే రక్షక దళం, జీఆర్‌పీ అధికారులకు హాట్‌స్పాట్ల సమాచారం ఇచ్చి అక్కడి ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పశువులను రైల్వేట్రాక్‌లకు సమీపంలోకి తీసుకు రానీయకుండా కొంతమేరకు నియంత్రిస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం గుంతలు తవ్విస్తున్నారు. అయితే రైల్వేట్రాక్‌ల అతిక్రమణను నిరోధించడానికి ఇది శాశ్వత పరిష్కారం కాదు. క్రాష్ బ్యారియర్స్‌ని నిర్మిస్తేనే పశువులు అతిక్రమించకుండా నిరోధించే అవకాశం ఉంటుంది. గుంటూరు డివిజన్‌లో ఉన్న సెక్షన్లన్నింటిలో 110 కిలోమీటర్ల వేగంతోనే రైళ్లు నడపడానికి కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అనుమతి ఉన్నది. దీంతో క్రాష్ బ్యారియర్స్ ఏర్పాటు చేయలేని పరిస్థితి. ఈ కారణంగా వీటిలో కొన్ని చోట్ల అతిక్రమణలను నివారించేందుకు ట్రెంచ్ కొట్టించడం (పొడవాటి గుంత తవ్వించడం) చేయిస్తున్నది. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఏ ఒక్క సెక్షన్‌లోనూ 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిచేందుకు అనుమతి లేకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ నిబంధన ఉంటేనే రైల్వే శాఖ ఆయా సెక్షన్లలో రైల్వేట్రాక్ అతిక్రమణ జరగకుండా బ్యారికేడింగ్ పనులకు అనుమతిస్తుంది.

డబ్లింగ్ తర్వాతే 130 కిమీ వేగం..

రేపల్లె - తెనాలి, కృష్ణాకెనాల్ - గుంటూరు, నంద్యాల - గుంటూరు, పగిడిపల్లి - గుంటూరు, న్యూపిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్లు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో డబుల్ లేన్(రెండు వరసల రైలు మార్గం) ఉన్న సెక్షన్లు కృష్ణాకెనాల్ - గుంటూరు, తెనాలి - గుంటూరు, గుంటూరు - దిగువమెట్ట మాత్రమే. మిగతా సెక్షన్లన్నీ సింగిల్ లేన్‌వే. గుంటూరు - పగిడిపల్లి డబ్లింగ్ పనులు ఇటీవలే మొదలయ్యాయి. అన్ని సెక్షన్లు డబ్లింగ్ పూర్తి అయితే తప్ప 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిపేందుకు సీఆర్ఎస్ అనుమతి ఇవ్వదు. అప్పటివరకు ప్రస్తుతం అనుమతి ఉన్న వేగంతోనే రైళ్లు నడుపుకోవాల్సిన పరిస్థితి. ఈ కారణంగా రైలుమార్గాలకు బ్యారికేడింగ్ చేసే అవకాశం లేకపోవడంతో పశువులు, మనుషుల అతిక్రమణలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి.

ఏఐ-పవర్డ్ థర్మల్, స్టాండర్డ్ కెమెరాలు అవసరం

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నంద్యాల - గుంటూరు సెక్షన్‌లో నల్లమల అటవీ ప్రాంతం ఉన్నది. అక్కడ తరచుగా రైళ్లు ఢీకొని వన్య ప్రాణులు మృతి చెందుతున్నాయి. తమిళనాడు రాష్ట్రంలోని పాలక్కాడ్ - కోయంబత్తూరు రూట్‌లో ఏనుగులు తరచుగా ట్రాక్‌లు దాటుతూ ప్రమాదానికి గురౌతున్నాయి. దీనిని నివారించేందుకు అక్కడి రైల్వే అధికారులు పలుచోట్ల కృత్రిమ మేథ - పవర్డ్ థర్మల్, స్టాండర్డ్ కెమెరాలను అమర్చారు. దీని వలన జంతువులు రైల్వే ట్రాక్‌ను దాటేందుకు వచ్చినప్పుడు ముందు గానే కంట్రోలర్లకు తెలిసిపోతుంది. దాంతో రైళ్ల వేగాన్ని తగ్గించి జంతువులు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాటేలా చేస్తున్నారు. అలాంటి విధానాన్నే ఇక్కడ అమలు చేయాలన్న డిమాండ్ ఉన్నది.

యానిమేషన్ సంస్థ మోసానికి ఒకరు బలి

- గుండెపోటుతో నరసరావుపేటలో వ్యాపారి మృతి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విజయవాడకు చెందిన యానిమేషన్ సంస్థ రూ.300 కోట్లకు పైగా కుచ్చుటోపీ పెట్టింది. నరసరావుపేట, పిడుగురాళ్లకు చెందిన బాధితులు పెద్దసంఖ్యలోఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో నరసరావుపేటకు చెందిన ఓ వ్యాపారి మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. సదరు సంస్థలో ఆ వ్యాపారి రూ.3.50 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు. తాను మోసపోయినట్లు తెలుసుకుని కొద్ది రోజులుగా తీవ్ర మనోవేదనలో ఉన్న ఆయన మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సంస్థ బోర్డు తిప్పేయడంతో ఒక్క నరసరావుపేటలోనే రూ.250 కోట్లకు పైగా నష్టపోయినట్లు బాధితులు చెబుతున్నారు. పిడుగురాళ్లలో కూడా కొందరు వ్యాపారులు కోట్లలోనే పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. వేరొక దేశంలో ఉంటున్న ఓ వ్యక్తి రూ.7 కోట్లు ఆ వ్యాపారి బ్యాంకు ఖాతాకు జమ చేశాడని సమాచారం. యానిమేషన్ సంస్థలో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు పంచుతానని కిరణ్ అనే వ్యక్తి నమ్మించడంతో అప్పులు చేసి చేతులు కాల్చుకున్నట్లు బాధితులు వాపోతున్నారు. యానిమేషన్ సంస్థ మోసాలపై విజయవాడ సీతానగరం పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదులు చేశారు. విజయవాడలో గత నెల 2న బోర్డు తిప్పేసి పరారు కాగా వారం క్రితం తమిళనాడులో ఉన్నట్లు బాధితులు గుర్తించారు. అయితే అక్కడి నుంచి ఆ వ్యాపారి పరారైనట్లు చెబుతున్నారు. తమిళనాడులో చిక్కిన మోసగాడిని విజయవాడకు తరలించి ఉంటే బాధితులకు కొంతైనా న్యాయం జరిగేదంటున్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు సరైన రీతిలో స్పందించడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

గంజాయి గుప్పుగుప్పు

- నరసరావుపేటలో విచ్చలవిడిగా విక్రయాలు
- మత్తులో జోగుతున్న యువత

అడ్డుకట్టు వేయడంలో పోలీసు, ఎక్సైజ్ శాఖల విఫలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)



జిల్లా కేంద్రం నరసరావుపేటలో గంజాయి గుప్పుమంటోంది. గంజాయి విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయి. పెద్ద ఎత్తున గంజాయి ఇక్కడకి సరఫరా చేస్తూ.. విద్యార్థులు, యువకులే టార్గెట్‌గా విక్రయాలు సాగుతున్నాయి. స్థానికంగా పెద్ద ఎత్తున ఈ మాదక ద్రవ్యాన్ని వినియోగిస్తున్నారనే విషయం అందో ళనకు గురిచేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి చేసేందుకు.. కొన్ని ముఠాలు పని చేస్తున్నాయి. అయితే గంజా యి విక్రయాలపై నిఘా పూర్తిగా కొరవడింది. దిగుమతి చేసు కున్న గంజాయిని వివిధ ప్రాంతాలకు చేర్చి చిన్న చిన్న ప్యాకెట్‌లు చేసి విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 వరకు విక్రయిస్తున్నా రు. అలాగే సిగరెట్‌ల రూపంలోనూ అందుబాటులో ఉంచుతున్నారు. చిలకలూరి పేట రోడ్డులోని ఎస్ఆర్‌కేటీ కాలనీ, వరకవకట్ట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు.. గంజాయి సేవించే వ్యక్తులు చెబుతున్నారు. ముఖ్యంగా యడ్లపాడు మండలం తిమ్మాపురం నుంచి ఇక్కడికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. గంజాయి మత్తులో యువకులు రాత్రిళ్లు హల్‌చల్ చేస్తున్నారు. ఈ మత్తు బారిన పడుతున్న యువకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈగల్ టీమ్ పేరుతో కొన్ని రోజులు పోలీసు శాఖ గంజాయి విషయం లో హడావుడి చేసిన విష యం తెలిసిందే. ప్రస్తుతం ఈ విభాగం పనిచేస్తున్న దాఖలాలు లేవన్న ఆరోపణలున్నాయి. గంజాయి విక్రయాలను అరికట్టడంలో పోలీసు, ఎక్సైజ్ శాఖలు విఫలమ య్యాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమార్కులకు అడ్డంకి లేకుండా పోయింది. పూర్తిస్థాయిలో తనిఖీలు చేసేందుకు అధికారులు సాహసిం చడం లేదు. వ్యసనాలకు బాని సలైన యువకులు గంజాయి మత్తులో జోగుతు న్నారు. విద్యార్థు లను గంజాయి మత్తుకు బానిసలను చేస్తున్నారు. గంజాయి విక్ర యాలను అరికట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

● మే 2న బాధ్యతల స్వీకరణ

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 106 కోర్టుల్లో పనిచేస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకో ర్టు రిజిస్ట్రార్ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా కోర్టు పరిధిలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. గుంటూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వి.దీప్తిని ఇక్కడే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్స్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో భీమవరంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.ధనరాజును నియమించారు. గుంటూరు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.నవ్యశ్రీని.. ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జి మైలాబత్తుల శోభారాణిని నియమించారు. ఎక్సైజ్ కోర్టులో జడ్జి జి.స్పందనను అనకాపల్లి జిల్లా యలమంచిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో గిద్దలూరు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా ధనమ్మను నియమించారు. గుంటూరులో ఆరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి(సీఐడీ కోర్టు) కె.శ్రుతవిందను విశాఖపట్నంలోని ఏడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్‌ను నియమించారు. మహమ్మద్ గౌస్ స్థానంలో అనంతపురం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సుజన్ కుమార్‌ను నియమించారు. రాజమండ్రి ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.జగదీశ్వరిని బదిలీపై గుంటూరు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నియమించారు. మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబును.. అక్కడే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కాకినాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రసన్నలక్ష్మిని నియమించారు. బాపట్లలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణిని పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియ మించి... పొన్నూరులోనే ఖాళీగా ఉన్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బాధ్యతలను కూడా నిర్వహించాలని ఆదేశించారు. కర్నూ లు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.కళ్యాణిని బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. నరసరావుపేట ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.ప్రవల్లికను పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జిగా నియమించి.. అక్కడ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.మురళి గంగాధరరావును రంపచోడవరానికి బదిలీ చేశారు. నరసరావుపేటలో ప్రవల్లిక బదిలీతో ఖాళీ అయిన స్థానంలో ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.సలోమినీ నియమించారు. రేపల్లెలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆమె స్థానంలో మచిలీపట్నంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడి వి.దేవి సాయి శ్రీవాణిని నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీ అయిన జూనియర్ సివిల్ జడ్జిలంతా మే 2వ తేదీ లోగా తమ కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

పీఎస్‌ఆర్ కాదు.. వైఎస్సార్ ఆంజనేయులు

●ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



పొన్నూరుటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీఎస్‌ఆర్ నాడు అధికార అహంకారంతో వైఎస్‌ఆర్ ఆంజనేయులుగా వ్యవహరించారని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం ధ్వజమెత్తారు. పీఎస్‌ఆర్ ఆంజనేయులు అరెస్టు చట్టానికి ఎవరూ అతీతులు కారనడానికి నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏసీబీ డీజీ, ఇంటిలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన పీఎస్‌ఆర్ తన అధికారాలను ఉపయోగించి తెలుగుదేశం పార్టీ నాయకులనే కాకుండా... విభేదాలున్న వ్యక్తులను, మహిళలను తప్పుడు కేసులతో అరెస్టు చేసి వేధించిన తీరు రాష్ట్ర ప్రజలందరూ చూశారన్నారు. వైసీపీ పాలనలో అపరిమిత అధికారాలను వినియోగించి, ఎంతో మందిని బెదిరించడమే కాకుండా తనకు ఉన్న అధికార పరిధిని దాటి అక్రమ కేసులు బనాయించి దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎంతో మంది మహిళల కన్నీటికి కారకుడని, రాష్ట్ర యువత భవిష్యత్‌ను అంధకారం చేసిన వ్యక్తి పీఎస్‌ఆర్ అని మండిపడ్డారు. ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉండి పరీక్ష పత్రాల అంశంలో అవకతవకలకు పాల్పడ్డారని, ప్రతిభ ఉన్న యువతను కాకుండా పైరవీ కారులకు పెద్ద పీట వేసిన దుస్థితి వైసీపీ పాలనలో జరిగిందని ఆరోపించారు. అధికార మదం, అధికార దుర్వినియోగం చేసే అధికారులు చట్టం నుంచి తప్పించుకోలేరని.. పీఎస్‌ఆర్ అరెస్టుతో మరోసారి అది నిరూపితమైందని ధూళిపాళ్ల అన్నారు.

26న రేవులకు వేలం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని నాలుగు రేవులకు ఈ నెల 26న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీల్డ్ టెండర్ల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. అచ్చంపేట మండలంలోని చింతపల్లి, మాదిపాడు, మాచవరం మండలంలోని గోవిందాపురం, కొల్లిపర మండలంలోని వల్లభాపురం రేవులకు బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వేలం ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్, యశ్వంత్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తొలగించేందుకు గుంటూరు మీదుగా భువనేశ్వర్, యశ్వంత్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు మే 24 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకి బయలుదేరి ఆదివారం ఉదయం 8.35 గంటలకు గుంటూరు, 9.20కి నరసరావుపేట, అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. నంబరు 02812 యశ్వంత్‌పూర్- భువనేశ్వర్ ప్రత్యేక రైలు మే 26 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి సోమవారం వేకువజామున 4.30 గంటలకి బయలుదేరి మధ్యాహ్నం 3.19 గంటలకు నరసరావుపేట, 4.30 గంటలకు గుంటూరు, మంగళవారం ఉదయం 6కు భువనేశ్వర్ చేరుకుంటుందన్నారు.

ప్రపంచ కార్మికవర్గ శ్వాస లెనిన్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ



లెనిన్ జయంతి సభలో ప్రసంగిస్తున్న రామకృష్ణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పీడిత, తాడిత ప్రజా పోరాటాలకు మార్గ నిర్దేశం చేసిన మహనీయుడు వీఐ లెనిన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. గుంటూరు సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన లెనిన్ 155వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. లెనిన్ 1917లో అక్టోబర్ మహా విప్లవం వల్ల రష్యాలో ప్రప్రథమ సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించారని గుర్తుచేశారు. తన జీవిత కాలంలో లెనిన్ ప్రపంచ కార్మిక విప్లవ ప్రగతిపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. విప్లవోద్యమ గమనంలో సంభవించే రకరకాల మలుపుల్లో సరైన ఎత్తుగడలు అనుసరించడంలో లెనిన్ తనకు తాను సాటి అనిపించుకున్నారని గుర్తుచేసుకున్నారు. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఆయన రచనలు నిరంతరం అధ్యయనం చేయడం అవసరమని సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో మతోన్మాద పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. లెనిన్ విగ్రహానికి రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెల నాసర్ జీ, పుప్పాల సత్యనారాయణ, గని, మేడా హనుమంతరావు, కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ కె.గంగాధర్ రావు పేర్కొన్నారు.విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో యూజీసీ స్పాన్సర్ రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ అన్ మ్యానెడ్ ఏరియల్ వెహికల్స్, అడ్వాన్సెస్, అప్లికేషన్స్ కార్యక్రమం డైక్ మెన్ ఆడిటోరియంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గంగాధర్ ప్రారంభించి, మాట్లాడారు.ఎన్.వి.డి.ఐ టెక్నాలజీని ఉపయోగించి,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని డ్రోన్‌లో ఉపయోగిస్తున్నారని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీలో అన్ని విభాగాల విద్యార్థులు ప్రతిభ సాధించాలని కోరారు. కీనోట్ స్పీకర్‌గా విచ్చేసిన ఏపీ డ్రోన్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ గడిమి శెట్టి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని డ్రోన్ హబ్ గా మార్చాలని కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును డ్రోన్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. ఆర్‌అండ్‌డీ మ్యానుఫ్యాక్చరింగ్ పవ మాన్ ఏవియేషన్ సీటీఓ విజయ్ వీరమల్లు, పవామాన్ ఏవియేషన్ ఎకౌంటబుల్ మేనేజర్, ఆర్.పి.టి.ఒ హృషికేశ్ వాడ్కర్, ఏరో మైండ్స్ డ్రోన్ సర్వీసెస్ సీ.ఈ.ఓ వంశీధర్ మజ్జి, పూర్వ విద్యార్థి, త్రీడీ హబ్స్ సీఈఓ సాయి కృష్ణ అనురూప్ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుత అతిథులను డాక్టర్ విజయ్ ప్రకాష్ పరిచయం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఎండీ తౌషిఫ్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్ డాక్టర్ సీహెచ్. తిరుమలరావు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, రెక్టర్ ఆచార్య రత్న శిలామణి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం. గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్ర మౌళి మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బోయపాటి పూర్ణ చంద్రశేఖర్, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో మునిగి వృద్ధురాలి మృతి

రేపల్లె, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమూడి పుష్కర ఘాట్‌కు సోమవారం సాయంత్రం వచ్చిన.. వట్టిచెరుకూరు మండలం గాడపారకు చెందిన పోలూరి ధనలక్ష్మి(74) కృష్ణా నదిలో మునిగి చనిపోయినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. సమాచారాన్ని బంధువులకు తెలిపామన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతికి గల కారణాలు విచారిస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.


ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

● ఎంబీఏ రీ వ్యాల్యుయేషన్ ఫలితాలు కూడా..

● ఏఎన్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి

పెదకాకాని, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల మొదటి సెమిస్టర్ 1/4 ఫలితాలను వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. ఎంబీఏ, ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ పునఃమూల్యాంకన ఫలితాలనూ విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. బీటెక్ 4/1, 4/4 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్‌గా సుజిత్ మల్లిక్



బాధ్యతలు స్వీకరిస్తున్న సుజిత్ మల్లిక్

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కన్నావారితోటలోని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్‌లో నూతన కమిషనర్‌గా సుజిత్ మల్లిక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు కమిషన రేట్ పరిధి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు (ఐదు జిల్లాలు) విస్తరించి ఉంది. నూతన కమిషనర్ భువనేశ్వర్ నుండి గుంటూరుకు ప్రమోషన్‌పై వచ్చారు. సుజిత్ మల్లిక్ రూర్కెలాలోని ఆర్ఈసీ (ప్రస్తుతం ఎన్ఐటీ) నుండి బీఈ (మెకానికల్ ఇంజినీరింగ్)ను 1997-2001లో పూర్తి చేశారు. ఒడిశాలోని ఆంగుల్‌లో నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్‌లో పనిచేసిన ఆయన 2007లో ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)లో చేరారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కొటిక్స్ (నాసెన్), ఫరీదాబాద్‌లో ప్రొబేషన్ ట్రైనింగ్ పూర్తి చేశారు. అనంతరం మొదటి పోస్టింగ్ కోల్‌కతాలోని ఎయిర్ కార్గో కాంప్లెక్స్ ఎన్ఎస్సీబీఐ ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరారు. అక్కడ ఆయన ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్, ఎస్ఐఐబీ, డ్రాబ్యాక్ వంటి విభాగాలను చూశారు. 2017లో జాయింట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొంది పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి కస్టమ్స్ లో పనిచేశారు. జీఎస్టీ అమలుకు ముందు, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లతో ఉన్న అంతర్జాతీయ సరిహద్దులోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్‌ల కంప్యూటరైజేషన్‌లో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. 2019 నుండి 2022 వరకు ఒడిశా ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో జాయింట్ సెక్రటరీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్‌కు (సీబీఐసీ) తిరిగి వచ్చిన అనంతరం ఆయన భువనేశ్వర్ జోన్‌లో జీఎస్టీ కస్టమ్స్ విభాగాల్లో పనిచేశారు. సీజీఎస్టీ గుంటూరు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లిక్‌ను పలువురు అధికారులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

ప్రారంభమైన న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు

● ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

పెదకాకాని, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి న్యాయశాస్త్రం కోర్సులు ఎల్ఎల్ఎం ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ), మూడేళ్ల



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీజీ కోర్సుల సమన్వయకర్త సుబ్బారావు

ఎల్.ఎల్.బి ప్రథమ సెమిస్టర్, ఐదేళ్ల బీఏ ఎల్.ఎల్.బి ఐదవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని గుంటూరులో రెండు, నరసరావుపేటలో ఒకటి, వర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఒకటితో పాటు ప్రకాశం జిల్లాలోని ఒక పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలను తనిఖీ బృందాలు సందర్శించాయి. రెండు పరీక్ష కేంద్రాల్లో చూచిరాతకు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశాయి. విశ్వవిద్యాలయం పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు వర్సిటీ పరీక్ష కేంద్రంలో పరీక్ష తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు మాట్లాడుతూ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు.. అన్ని చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల కేటాయింపుల్లో అసమానతలను సరిదిద్దాలి

-యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను నాలుగు రకాలుగా విభజించి, విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి రకరకాలుగా నిర్ణయించడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇది అన్ని పాఠశాలల్లో ఒకే రకంగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టంపై



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ వెంకటేశ్వర్లు

మంగళవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ స్కూల్లో 30 మంది పిల్లలకు ఒక టీచరు, మోడల్ ప్రైమరీ స్కూల్లో 20 మంది పిల్లలకు ఒక టీచరు, హై స్కూల్ ప్రైమరీలో 10 మంది పిల్లలకు 1 టీచరు కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అన్ని పాఠశాలల్లో కేటాయింపులు ఒకే విధంగా ఉండాలని అందరికీ నాణ్యమైన విద్య అందాలని కోరారు. రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంత రావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షులు జీ వెంకటేశ్వర్లు, నాగమణి, జిల్లా కోశాధికారి దౌలా జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఎంపికైన డాక్టర్ పెండెం ప్రత్యూష్



సత్తెనపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన న్యాయవాది పెండెం బాబూరావు తనయుడు పెండెం ప్రత్యూష్ సివిల్స్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో 797 ర్యాంకు సాధించారు. ప్రత్యూష్ ఎంబీబీఎస్ చదువుతూ 2021-22లో మెడికల్ సైన్స్ ఆప్షన్‌గా తీసుకొని సివిల్స్ రాశారు. ప్రిలిమినరీ పాసైనప్పటికీ మెయిన్స్ ఆగింది. గుంటూరు మెడి కల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి.. ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు అందిస్తూ 2023 - 24లో ఆంత్రో పాలజీని ఆప్షన్‌గా ఎన్నుకొని సివిల్స్ రాశారు. తొలి ప్రయత్నంలో సివిల్స్ రానప్పటికీ ఎంబీబీఎస్ సీటు సాధించి వైద్య సేవలు అందిస్తూనే సివిల్స్ లక్ష్యాన్ని సాధించారు. తల్లిదండ్రులు బాబూరావు, పద్మల ప్రోత్సాహంతోనే ప్రత్యూష్ సివిల్స్‌కు ఎంపికయ్యారు. కష్టపడి చదివితే యువత అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని ప్రత్యూష్ తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు న్యాయవాదులు సమాచారం తెలుసుకొని వారి గృహానికి వెళ్లి ప్రత్యూష్‌ను అభినందించారు. తమ కుమారుడు సివిల్స్‌కు ఎంపిక కావటం ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

పిడుగురాళ్ల సీటీవోకు 830వ ర్యాంకు



వావిలపల్లి భార్గవ

పిడుగురాళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో పిడుగురాళ్ల సీటీఓ వావిలపల్లి భార్గవ 830వ ర్యాంక్ సాధించారు. విజయ నగరం జిల్లా సారధి గ్రామానికి చెందిన ఆయన రాజాంలో ప్రాథమిక విద్య, జీఎంఆర్ ఐటీలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. 2017 నుంచి 2019 వరకు స్టేట్ బ్యాంక్‌లో అసోసియేట్‌గా పనిచేశారు. గ్రూప్-1 ఇంటర్వ్యూకు 2018-22లో హాజరై 2022లో సెలక్టయ్యారు. ప్రస్తుతం పిడుగురాళ్ల జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ప్రకటించిన యూపీపీఎస్సీ సివిల్స్ ఫలితాలలో ర్యాంక్ సాధించిన భార్గవ.. ఇంట్లోనే చదువుకుంటూ 4వ ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్‌కు సెలక్ట్ అయ్యారు. భార్గవ తండ్రి విష్ణు స్కూల్ హెచ్ఎంగా పనిచేస్తుండగా.. తల్లి గృహిణి. సివిల్స్‌కు ఎంపిక కావడమే తన జీవిత లక్ష్యమని భార్గవ తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



చెరుకుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెనాలి నుంచి నగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు చెరుకుపల్లిలోని ఇండెన్ గ్యాస్ గోడౌన్ దగ్గర అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు పదిమంది ఉన్నారు. కొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణాపాయం లేదు. డ్రైవర్ రవికుమార్ కథనం ప్రకారం.. గోడౌన్ దగ్గర ఉన్న మలుపు వద్ద కారు వేగంగా రావడంతో దానిని తప్పించడానికి ప్రక్కకి తిప్పగా.. పక్కనే ఉన్న గుంతలో పడి అదుపుతప్పి బస్సు చేలల్లోకి పల్టీకొట్టిందని చెప్పారు. తెనాలి ఆర్టీసీ డీఎం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు క్రేన్ సాయంతో బస్సును రోడ్డుపైకి చేర్చారు.

25న ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2025

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2025 ఈ నెల 25న నిర్వహిస్తున్నామని నాగార్జున సాగర్ ఏపీఆర్ జేసీ ప్రిన్సిపల్, పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్.సరోజిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్ఎస్ క్యాట్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.. 5, 6, 7, 8 తరగతులలో ప్రవేశానికి ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్షకు 944 మంది విద్యార్థులు హాజరు అవుతారని, నాలుగు సెంటర్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాల కోసం ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ పరీక్షకు 1,706 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఏడు కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 22, (ఆంధ్రజ్యోతి): ఇటీవల బరంపేటలో చోటుచేసుకున్న ఓ హత్య కేసులో నిందితుడు ఆకుల కిషోర్‌ను మంగళవారం అతని ఇంటి వద్దనే అరెస్టు చేసినట్లు రెండవ పట్టణ సీఐ ఎం.హైమారావ్ తెలిపారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లోఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరులోని గుజ్జనగుండ్లకు చెందిన కిషోర్ పట్టణానికి చెందిన శివకుమారిని వివాహం చేసుకున్నాడు. భర్తతో గొడవలు తలెత్తడంతో భార్య శివకుమారి బరంపేటలో పుట్టింటికి వచ్చి తల్లి నాగమ్మతో కలిసి ఉంటోంది. కిషోర్ కూడా తన అత్త నాగమ్మ ఇంటి వెనుక వైపు అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఆస్తిలో వాటా ఇవ్వమని తరచూ గొడవ చేస్తుండగా నాగమ్మ సదరు ఇంటి నుంచి కిషోర్‌ను ఖాళీ చేయించింది. అనంతరం కిషోర్ తరచూ నాగమ్మ ఇంటికొచ్చి ఆస్తి విషయమై.. గొడవ చేస్తుండేవాడు. ఈ క్రమంలో అతను ఖాళీ చేసిన ఇంటిలో ఉంటున్న వెంకటేష్ అనే వ్యక్తి అతనిని వారించాడు. దీంతో కిషోర్ మనస్సు లో పెట్టుకొని వెంకటేష్‌ను ఇల్లు ఖాళీ చేయమని లేకుంటే అంతు చూస్తానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో వెంకటేష్ తన ఇంటికి రాగా కిషోర్ రోడ్డు పక్కన ఉన్న పరంజ కర్రతో అతని తలపై బలంగా కొట్టాడు. అక్కడే కుప్పకూలిపోయిన వెంకటేష్‌ను భార్య అనురాధ, బంధువులు చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఈ నెల 20న మధ్యాహ్నం మరణించినట్లు సీఐ హైమారావు తెలిపారు. హత్య అనంతరం నిందితుడు కిషోర్ గుంటూరు, అక్కడి నుండి విజయవాడ వెళ్లినట్లు తెలిపారు.అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు రాగా తాను, మహిళా ఎస్సై లేఖ ప్రియాంక సిబ్బంది తిరుమలరావు కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు. కిషోర్ పై గతంలో సస్పెక్ట్‌షీట్ ఉందని, 8 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కిషోర్ పై రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 514.60 అడుగులు ఉంది. ఇది 139.61 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

1,30,566 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,32,566 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,30,735 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 65,399 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13400
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా		
341	10000	13000	బ్యాడిగి 5531	--	--
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12400
సూపర్10	--	--	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

సివిల్స్‌లో 146వ ర్యాంకు అభినందనీయం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

అచ్చంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం యువకుడు చల్లా పవన్ కళ్యాణ్ సివిల్స్‌లో 146వ ర్యాంకు సాధించటం అభినందనీయమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకుడు చల్లా రమేష్ కుమారుడు ఈ ర్యాంకు సాధించటం తల్లిదండ్రులకే కాకుండా పల్నాడు జిల్లాకే గర్వకారణమన్నారు. పట్టుదలతో చదవటం ద్వారా ఎంతటి విజయాన్నైనా సాధించగలం అనే దానికి నిర్వచనమే చల్లా పవన్ కల్యాణ్ అని శ్రీధర్ అన్నారు.

నేడు రామాలయ శిఖర ప్రతిష్ఠ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎనికపాడులో పునర్నిర్మించిన కోదండ రామాలయ శిఖరప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ జరుగుతుంది. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ హాజరవుతున్నారని మాజీ సర్పంచ్ భాష్యం జగదీష్ తెలిపారు. ఉదయం 7.30గంటలకు ప్రతిష్ఠ జరుగుతుందని జగదీష్ తెలిపారు.

గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



గురజాలటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోట శ్రీనివాసరావు నూతనంగా ఎన్నికయ్యాడు. మంగళవారం పట్టణంలోని కోర్టు హాల్లో ఈ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా చీతిరాల కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా కత్తి చలమరాజు, జాయింట్ సెక్రటరీగా డీ లింగరాజు ఎన్నికయ్యారు. వీరి ఎన్నికలపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కుంకలగుంటలో పోలీసు పికెటింగ్

నకరికల్లు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకలగుంటలో మంగళవారం పోలీసు పికెట్ కొనసాగుతుంది. సోమవారం టీడీపీ సానుభూతి పరుడు ఉప్పలపాటి సుబ్బయ్యపై వైసీపీ మూకలు దాడి చేసి గాయ పరిచిన విషయం తెలిసిందే. గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉంది.

భార్య మృతి కేసులో భర్త అరెస్టు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళ లేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న కేసులో భర్తను అరెస్టు చేశారు. మండలంలోని కంటెపూడి గ్రామానికి చెందిన గుంటగాని శిరీష కేసులో భర్త గుంటగాని వేణును మంగళవారం అరెస్టు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. వేణును న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి వేణుకు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మాచర్లరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని 13వ వార్డులో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఓ గుర్తు తెలియని వృద్ధుడిని పోలీసులు గుర్తించి 108 అంబులెన్స్‌లో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు అదేరోజు మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించి అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. కాగా చికిత్స పొందుతూ వృద్ధుడు సోమవారం రాత్రి మరణించినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడు ఆకస్మిక మృతి

దాచేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం నివాసి ఐన పప్పుల సత్యానందం(55) ఆకస్మికంగా మృతి చెందాడు. మంగళవారం కుటుంబసభ్యులు నరసరావుపేట నుంచి దాచేపల్లి నగర పంచాయతీలోని నారాయణపురం స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించారు. యూటీఎఫ్ నాయకుడిగా, ఉపాధ్యాయ సమస్యలపై సత్యానందం రాజీ లేని పోరాటం చేశారు. దాచేపల్లి నగర పంచాయతీలోని ఇరికేపల్లి, ఎంఎస్ పేట, ముత్యాలంపాడు పాఠశాలల్లో పని చేశాడు. ప్రస్తుతం నరసరావుపేటలోని యలమంద గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఆకస్మికంగా మృతి చెందాడు. మరణ వార్తను తెలుసుకున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి సత్యానందం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య రత్నకుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 28.26 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

విద్యార్థిమిత్రతో చదువుకు చేయూత

● ఎంఈవో-2 శివనాగేశ్వరరావు

రెంటచింతల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యావిధానంలో విప్లవాత్మక మార్పుల్లో భాగంగా పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రి అందించడానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో కిట్లను అందచేయనున్నట్లు ఎంఈవో శివనాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం మంచికల్లు గ్రామ ఎంపీయుపీ పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశం అలాగే పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని నొక్కి చెప్పారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, సీనియర్ టీడీపీ నేత యరపతినేని మట్టయ్య, హెచ్ఎం వీర వసంతకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ జానకి, స్వప్న, వెంకటేశ్వర్లు, భాస్కర్, రమణారెడ్డి,జాని, నాగరాజు, సిలార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తే మెరుగైన ఆదాయం

● జిల్లాలో నడికూడి యార్డుకి మూడో స్థానం
● ఏడాదికి రూ.7 కోట్లు ఆదాయం



నడికూడి వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కమిటీ కార్యాలయం



మిర్చి కొనుగోళ్లలో పాల్గొన్న రైతులు, వ్యాపారులు

దాచేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు పనుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెడుతోంది నడికూడి మార్కెట్ యార్డు. నిత్యం వందలాది మంది రైతులు ఎటువంటి వ్యయ ప్రయాసలు లేకుండా నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తమ పంటలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాడు ప్రాంతంలో పండిన పంటలు శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణా రాష్ట్రాలకు తరలిపోతుంది. ఒకప్పుడు వెనుకబడిన పల్నాడుగా పిలవబడ్డ మార్కెట్ యార్డు అంచెలంచెలుగా ఎదిగి బంగ్లాదేశ్, శ్రీలంక వంటి ఇతర దేశాలకు కూడా ఇక్కడ పండించిన పంట రవాణా జరుగుతుంది. మార్కెటింగ్ ఫీజు(చెస్) ద్వారా రూ.7కోట్ల ఆదాయం లభిస్తుందన్నారు. 18 మంది లైసెన్స్ కలిగిన ట్రేడర్లు, 38 మంది దిగుమతి దారులున్నారు. నిత్యం ఐదు వందల మందికి పైగా రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకొని తమ పంటలను అమ్మకాలు సాగిస్తుంటారు. సీసీఐ ద్వారా పత్తి అమ్మకాలతో రూ.74 కోట్ల లావాదేవీలు జరిగాయి. విశాలమైన మార్కెట్ యార్డు స్థలంలో ధాన్యం, మొక్కజొన్న ఆరబెట్టేందుకు రైతులకు అనుకూలంగా ఉంది. హైదరాబాద్ టూ చెన్నై రాష్ట్ర రహదారికి ఆనుకొని ఉండటంతో రవాణా పరంగా ఎంతో సులభంగా ఉంది. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో కలిపి 14 కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నాయి. కోల్డ్ స్టోరేజ్ యజమానులు కూడా తమవంతుగా రైతులకు అమ్మకాలు, కొనుగోళ్లలో సహకస్తున్నారు.

దూర ప్రాంత రైతులకు వసతులు

దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు తమ పంటలను ఆర బెట్టుకొనేందుకు, విశ్రాంతి తీసుకొనేందుకు గదులు నూతనంగా నిర్మించారు. కాగా యార్డులో భోజన వసతి, అల్పాహారం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే రైతులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. పల్నాడు ప్రాంతానికి చెందిన వ్యాపారులే కాకుండా గుంటూరులోని పెద్ద వ్యాపారులు కూడా నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోళ్ళు నిర్వహిస్తే రైతులకు మరింత లాభసాటి ధరలు వస్తాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు యార్డు అభివృద్ధికి సహకరించడంతో పాటు మేలైన వసతులు కల్పించాలని స్థానిక రైతుల నుంచి ప్రధాన డిమాండ్‌గా ఉంది. పది సంవత్సరాలుగా నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో మార్కెట్ యార్డులో సమూలమైన మార్పులు తీసుకువచ్చారు. నాలుగు సంవత్సరాలుగా పడకేసిన అభివృద్ధికి తిరిగి పాటు పడాల్సిన అవసరం ఉంది. ధాన్యం నిల్వ చేసేందుకు కూడా గోడౌన్‌లు నిర్మించారు.

రైతులకు అన్ని విధాలా సహకరిస్తాం

\- యార్డు కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు



మిర్చి, ధాన్యం అమ్ముకొనే రైతులకు అన్ని విధాలా సహకరిస్తామని యార్డు కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు వివరించారు. పల్నాడు జిల్లాలో ఆదాయపరంగా నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డు రెండు సంవత్సరాలుగా మొదటి స్థానంలోను, ఈ ఏడాది మూడో స్థానంలో ఉంది. దీనిని మరింత అభివృద్ధి పరచి మొదటి స్థానానికి తీసుకువచ్చేందుకు వ్యాపారులు, ట్రేడర్లు కలసి మెరుగైన సేవలు అందిస్తామని వివరించారు.

మోడల్ పంచాయతీ జాబితాలో కారంపూడి, రెంటచింతల

● డీపీవో భాస్కర్‌రెడ్డి

కారంపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు జాబితాను సిద్ధం చేసిందని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కారంపూడిని సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కారంపూడి, రెంటచింతలను మోడల్ పంచాయతీలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తడి, పొడి చెత్త కేంద్రాల పనితీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కారంపూడి, రెంటచింతల పంచాయతీల్లో త్వరలో మోడల్ పంచాయతీ కార్యకలాపాలు అమల్లోకి వస్తాయన్నారు. డీపీవో వెంట ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ తదితరులు పాల్గొన్నారు.

వానపాముల ఎరువులు తయారు చేయించాలి

● డీఎల్‌పీవో లక్ష్మణరావు



సంపద తయారీ కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తున్న నాడప్ తొట్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు తదితరులు

మాచవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల సంపద తయారీ కేంద్రాల్లో వానపాముల ఎరువు తయారు చేయించాలని నరసరావుపేట డీఎల్‌పీవో స్థానిక అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో మోర్జం పాడు, మాచవరం, పిన్నెల్లి గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడప్ తొట్లు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయాలని, షెడ్డు లోపల వానపాముల ద్వారా ఎరువు తయారు చేయించి స్థానిక రైతులకు విక్రయించే విధంగా చూడాలన్నారు. అంతేగాకుండా కొన్ని గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఇరువుల దిబ్బలు కన్పిస్తున్నాయని, అవి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఇంటింటికి తిరిగి తడి చెత్త, పొడి చెత్త సేకరించే విధంగా క్లాప్ మిత్రలు చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ వెంకటరావు, పంచాయతీ కార్యదర్శులు ఖాన్, కోటేశ్వరరావు, రవి, సచివాలయ సిబ్బంది, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో ఉన్న అర్చక భూములకు విముక్తి



అర్చక భూముల ఒప్పందపత్రాలను పూజారులకు అందజేస్తున్న రామలింగేశ్వర శాస్త్రి

రెంటచింతల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గత 31 సంవత్సరాల నుంచి ఆక్రమణల చెరలో ఉన్న దేవాలయ భూములకు కూటమి ప్రభుత్వం చొరవతో నేడు విముక్తి కల్పించినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి చెప్పారు. ఆ మేరకు మంగళవారం ఏపీ అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి చేతుల మీదుగా ఒప్పంద పత్రాలను పూజారులకందచేశారు. స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తుమ్మకోటలోని శ్రీసీతారామస్వామి, జనార్దన స్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన అర్చక భూములను ప్రజాసంఘాల పేరుతో 58 ఎకరాలను ఆక్రమించి సాగు చేసుకుంటూ కౌలు చెల్లించడం లేదు. ఈ క్రమంలో దేవదాయశాఖకు చెందిన అధికారులు, అర్చక సంఘ నేతలు ప్రభుత్వంతో పలు దఫాలు జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. దీంతో ఒప్పంద పత్రాలను అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు మల్లికార్జున శర్మ, గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, గాదే శౌరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో సుమతి శతకం సినిమా సందడి



పెదకూరపాడులో సినిమా షూటింగ్

పెదకూరపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులో సుమతి శతకం సినిమా సందడి నెలకుంది. ఈ సుమతి శతకం చిత్రాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తనయుడు సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్‌ను ఇటీవల అమరావతిలో ప్రారంభించగా మూడు రోజులుగా పెదకూరపాడులోని ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలో కొమ్మాలపాటి శ్రీధర్ గృహంలో, పలు ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ షూటింగ్‌ను పెదకూరపాడు ప్రాంత వాసులు అధిక సంఖ్యలో తిలకిస్తున్నారు. అమరదీప్ కథానాయకుడిగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శైలు కథా నాయికగా నటిస్తున్నారు. విజన్ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎంఎం నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. కొత్తదనంతో నిర్మిస్తున్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని సినీ వర్గాలు తెలిపాయి.

సమస్యల నమోదు కౌంటర్ ప్రారంభం



తహసీల్దారు కార్యాలయంలోని సమస్యల నమోదు కౌంటర్‌లో వివరాలు తెలుపుతున్న రైతు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మండల రెవెన్యూ పరిధిలో రైతులు తమ సమస్యలను కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో నమోదు చేయించుకోవచ్చునని తహసీల్దార్ జె.మధుబాబు తెలిపారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రైతుల పనులు చేయకుండా ఇబ్బంది పెడుతున్నా.. కాలయాపన చేస్తున్నా కార్యాలయంలో నమోదు కౌంటర్‌లో రైతులు, బాధితులు వివరాలు తెలిపినట్లైతే సంబంధిత అధికారితో ఏరోజుకు ఆరోజు మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించేలా చూస్తారని తహసీల్దార్ మధుబాబు తెలిపారు.

విద్యార్థులకు వృత్తి విద్యా ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాలు పంపిణీ

దుర్గి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం 10 రోజులపాటు జరిపారు. రిటైల్, అపేరల్ కోర్సుల్లో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.బెంజిమెన్, హెచ్ఎం కోటేశ్వరమ్మ, ఒకేషనల్ ట్రైనర్స్ కె గంగరాజు, గంగాభవాని, చైతన్యవర్మ, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, హనుమంతురావు, అనంతరామయ్య, చక్రపాణి, రమాదేవి, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున శిల్ప కళా కేంద్రానికి అరుదైన గౌరవం



దుర్గి శిల్పాలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

దుర్గి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని నాగార్జున శిల్ప కళా కేంద్రానికి అరుదైన గౌరవం లభించింది. ఢిల్లీలో మంగళవారం జరిగిన అమృత్ మహోత్సవ కార్యక్రమంలో దుర్గి శిల్పాలను ప్రదర్శించారు. అద్భుతమైన శిల్పాలు తిలకించిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము దుర్గిలోని నాగార్జున శిల్పకళా కేంద్రం నుంచి తెచ్చిన శిల్పాలను చూసి శిల్పి చెన్నుపాటి సాయివినయ్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

26 నుంచి స్లాట్ బుకింగ్ ఉంటేనే రిజిస్ట్రేషన్లు

● సబ్‌రిజిస్ట్రార్ నాగశైలజ



పిడుగురాళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు ఈ నెల 26 నుంచి స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉందని సబ్‌రిజిస్ట్రార్ నాగశైలజ మంగళవారం తెలిపారు. ఈ నెల 26 నుంచి స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని, పాత విధానం ఉండబోదన్నారు. ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎప్పుడైనా ఎక్కడి నుండైనా చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతిరోజు 39 రిజిస్ట్రేషన్లకే స్లాట్ బుకింగ్ సౌకర్యం ఉందని, అంతకు మించి రిజిస్ట్రేషన్లు చేయబోమన్నారు. అమ్మకం, కొనుగోలు దారులు ఈ-స్లాట్ బుకింగ్‌పై అవగాహన చేసుకొని రిజిస్ట్రేషన్ కొరకు ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకొని తేదీ, సమయం ప్రకారం కార్యాలయానికి రావాలని తెలియజేశారు.

క్రోసూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

క్రోసూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈనెల 26వ తేదీ నుంచి స్లాటు బుకింగ్ రిజిస్ట్రేషన్‌లు ప్రారంభిస్తున్నట్టు సబ్ రిజిస్ట్రార్ ఎం విజయ ప్రసాదరావు తెలియజేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 26వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్‌లు చేయించుకొనే వారు ముందుగా స్లాటు బుకింగ్ చేసుకోవాలన్నారు. వివరాల కోసం క్రోసూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

● అమరావతి (ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీని తగ్గించేందుకు ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈనెల 26వ తేదీ నుంచి భూ క్రయ విక్రయదారులు సద్వినియోగించుకోవాలని సబ్‌రిజిస్ట్రార్ వెంకటరెడ్డి తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

అచ్చంపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. మంగళవారం అచ్చంపేట ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ సమస్యలపై అధికారులను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖల పనితీరుపై ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అడిగారు. పులిచింతల ప్రాజెక్టు వరకు బస్సును నడిపించాలని రవాణాశాఖ అధికారులను కోరారు. గ్రామాల్లో బాల్య వివాహాలను కట్టడిచేసేందుకు ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం కోరారు. సమావేశానికి ఫారెస్టు, ఎక్సైజ్, పోలీసులు, విద్య, సాంఘిక సంక్షేమ అధికారులు హాజరు కాకపోవటంపై జిల్లా అధికారులకు రాత పూర్వకంగా తెలియజేయాలని ఎంపీపీ స్వర్ణమ్మబాయి, ఎంపీడీవో శ్రీనివాస్‌లు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, మండలపరిషత్ ఉపాధ్యక్షుడు బాబు, సాగునీటి సంఘ అధ్యక్షులు పాపిరెడ్డి, భూక్యా రమేష్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈ సమీక్ష

మాచర్లటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్ఈ పి.విజయకుమార్, ఈఈ ఎన్ సింగయ్యలు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ రెవెన్యూ కలెక్షన్, ఇతర శాఖలకు చెందిన పనుల గురించి రివ్యూ జరిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్య విత్తనాల కిట్ల పంపిణీ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) నవధాన్య విత్తనాల కిట్‌లను సాగుభూములలో తొలకరి వర్షానికి ముందుగా చల్లుకోవడం ద్వారా భూములు వేసవి తాపానికి గురికాకుండా ఉంటాయని, కర్బనశాతం పెరుగుతుందని పకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ అమలకుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తలూరు రైతుసేవా కేంద్రంలో నవధాన్య విత్తనాల కిట్‌లను తయారు చేసి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ రామచంద్రన్, శ్రీనివాసరావులు పాల్గొని మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులు నవధాన్య కిట్‌లు ఉపయోగించడం వల్ల పంటల సాగులో ఖర్చు తక్కువతో అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏవో అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

స్టేడియం భవనాల పరిశీలన



రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న స్టేడియం భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న స్టేడియం భవనాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు. స్టేడియంను వినియోగంలోకి తెచ్చేందుకు వెంటనే సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని కన్నా ఆదేశించారు. స్టేడియంలో ఇంకా చేయాల్సిన పనుల గురించి అధికారులతో చర్చించారు. స్టేడియం భవనాలను వినియోగంలోకి తెస్తే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. కన్నా వెంట పీడీ దాసరి కోటేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, సయ్యద్ పెద కరిముల్లా, కోమటినేని శ్రీనివాసరావు, అతుకూరి నాగేశ్వరరావు, సయ్యద్ మాబూ, వక్కంటి అజయ్, పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈవో చంద్రకళ

● అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించిన ఎఫ్ఎల్ఎన్ బృందం



విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

క్రోసూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ ఆధ్వర్యంలోని ఎఫ్ఎల్ఎన్ బృందం మంగళవారం క్రోసూరు కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించింది. బృందంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏపీసీ సుబ్బారావు, జీసీడీవో రేవతి తదితరులున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను డీఈవో చంద్రకళ, ఇతర బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిని రైజింగ్ స్టార్స్‌గా పిలవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌తో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలో అమలు చేస్తున్న అంశాలను విద్యార్థులు అందుకునేందుకు విద్యాశాఖ దృష్టి పెట్టిందన్నారు. ప్రాథమిక స్థాయిలో అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరిచే ఆలోచనతో ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, గణేష్, ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి లక్కీడీప్ విజేతలకు బహుమతుల అందజేత



వీరవల్లి నరసమ్మ

నకరికల్లు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి పాఠకులకు లక్కీడీప్‌లో విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. కుంకలగుంటలో వీరవల్లి నరసమ్మకు, లక్కు వెంకటేశ్వరరెడ్డి సర్క్యులేషన్ ఏసీవో కోలా కిషోర్ కుమార్, ఏజెంట్ మస్తాన్‌వలి బహుమతులను అందజేశారు.

కారంపూడి వాసులకు కన్సోలేషన్ బహుమతి



బహుమతి అందుకుంటున్న వరలక్ష్మణరావు

కారంపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక లక్కీడిప్ కూపన్లలో లాటరీలో కారంపూడి పట్టణానికి చెందిన వెచ్చా వరలక్ష్మణరావు, తండా పర్వీన్‌లు కన్సోలేషన్ బహుమతి పొందారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్రజ్యోతి ఏజెంట్ సుబ్బారావు ఈ బహుమతులను అందించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

● ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఉమాదేవి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి

కారంపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత దూరం అవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని ఒప్పిచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మునగాకు, కరివేపాకు కలిపిన కారంపొడి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎన్ నాగేంద్రమ్మ, జే మంగమ్మ, దీనకుమారి, సీహెచ్ వరలక్ష్మి, ఎన్ సత్యవతి, సీహెచ్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

పెదకూరపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని అటల్ స్టేట్ అధికారి సుదర్శన్ అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు జడ్పీ హైస్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో బూట్ క్యాంపు ముగిసింది. ఈ కార్యక్రమంలో అటల్ స్టేట్ హబ్ మెంటల్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ల్యాబ్ ఇన్‌చార్జ్ కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు.



పుస్తక పఠ(త)నం

● అద్భుతమైన పుస్తకం... జ్ఞానామృతపానం
● మార్గనిర్దేశనం చేసే మంచి స్నేహం
● టెక్నాలజీ వెంట యువత పరుగులు
● పతనమవుతున్న పుస్తక పఠనాసక్తి
● అక్షరాలను ఆస్వాదించలేకపోతున్న వైనం
● ప్రభుత్వాల నుంచి శ్రద్ధ కరువు..
● నూతన పుస్తకాలకు ప్రోత్సాహం ప్రహసనం
● అలంకారప్రాయంగా గ్రంథాలయాలు
● ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లలో సెస్ బకాయిలు

● నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

వాడు పుస్తకాల పురుగురా... ఎప్పుడు చూసినా లైబ్రరీలోనే ఉంటాడు...! కనిపించిన ప్రతి చిత్తు పేపరూ చదువుతాడు.. ఇలాంటివన్నీ ఒకప్పుడు వినేవాళ్లం... ఇప్పుడు స్నేహితుల మధ్య ఆన్‌లైన్ గేమ్‌లు, వీడియో గేమ్‌ల ప్రస్తావన తప్ప మచ్చుకైనా పుస్తకం మాటే వినిపించడం లేదు. ఒకప్పుడు యువత కోసం నవలలు, మహిళల కోసం వార పత్రికలు, పెద్దల కోసం వార్తా పత్రికలు, పిల్లల కోసం చందమామ, బాలమిత్ర వంటి కథల పుస్తకాలు అనేకం అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అవేవీ పుస్తక ప్రదర్శనశాలలో తప్ప ఎక్కడా పెద్దగా కనబడడం లేదు. ఎందుకు? చదివే వారు కరువయ్యారు. టెక్నాలజీ వీటన్నింటినీ డామినేట్ చేసేసింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రంథాల యాలు కిటకిటలాడేవి. ఇప్పుడు వాటిని పట్టించుకునే నాథుడే లేడు. భాష చచ్చిపోతుందని గోస పెట్టే భాషాభిమానులు అసలు ఎందుకిలా జరుగుతోందని ఆలోచించడం లేదు. ప్రభుత్వాలు కూడా భాషాభివృద్ధి సంఘాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందే తప్ప.. అసలు కారణాన్ని వెదకడంపై అలక్ష్యం వహిస్తోంది. చదవడమే రాకపోతే అసలు భాష ఎలా అభివృద్ధి చెందుతుంది? ప్రజల్లో పఠనాసక్తి పెంచడంపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తే వారిలో మానసిక వికాసంతో పాటు భాషపై పట్టు దొరికి.. అక్షరం పది తరాలు వర్ధిల్లే అవకాశం ఉంది. నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా నానాటికి అంతరించి పోతున్న పుస్తకాల మనుగడపై ప్రత్యేక కథనం.

మంచి పుస్తకం... మార్గనిర్దేశకుడు

మంచి పుస్తకం మనల్ని సరైన మార్గంలో నడిపించే మార్గనిర్దేశకుడు అనడంలో ఎటువంటి సందేహం లేదు. మనలో జరిగే సంఘర్షణలకు, బాధలకు ఓ మంచి పుస్తకం పఠనం సాంత్వన కలిగిస్తుంది. సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, ద్వేషం, స్వార్థం ఇవన్నీ కూడా మనుషుల్లో సున్నితత్వం లోపించడం వల్లే పెరుగుతున్నాయి. పుస్తక పఠనం ఆలోచింపజేస్తుంది. సున్నితత్వం వైపు నడిపిస్తుంది. అయితే.. యువత టెక్నాలజీ వెంట పరుగులు తీస్తూ పుస్తకాన్ని చదవడం అనే విషయాన్నే మర్చిపోతోంది. గ్రంథాలయాల ద్వారా పుస్తక పఠనం మీద ఆసక్తి పెంచాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా ప్రయత్నాలే మానేసి ఉన్న లైబ్రరీలను కూడా అలంకార ప్రాయంగా మార్చేశాయి. పుస్తకం ఆనందాన్నిస్తుంది. మన జీవిత గమనాన్నే మారుస్తుంది. మంచి మిత్రుడిలా మనకు తోడుంటుంది. తరాల మధ్య వారధిగా ఉం టూ వ్యక్తిత్వాలకు సాన పెడుతుంది. ఇన్ని సుగుణాలతో మన జీవితాలతో మమేకం కావాల్సిన పుస్తకాలు నేడు నిరాదరణకు గురవుతున్నాయి. అసలు భవిష్యత్తులో చేతిలో పుస్తకం పట్టుకుని చదివే వారుంటారా అనే స్థాయికి ఈ పతనం కొనసాగుతుం డడం ఆందోళన పరుస్తోంది. పుస్తకం పఠనం ఆవశ్యకతను వివరిస్తూ దానిని దినచర్యలో భాగం చేసుకోవాలంటూ ప్రతి ఏడాది ఏప్రిల్ 23న యునెస్కో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.


శిథిల భవనంలో కొనసాగుతున్న బాపట్ల శాఖ గ్రంథాలయం

యువతను ఆ దిశగా నడిపించేవారే కరువు

పుస్తకాలు చద వడం దిశగా యువ తను నడిపించే వారే కరువయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ముఖ్యంగా బాపట్ల అయితే ఎడ్యుకేషన్ హబ్‌గా విరాజిల్లుతోంది. కానీ, కళాశాలల్లో సబ్జెక్ట్ ఓరియంటెడ్ కుస్తీలు తప్ప మానసికంగా ఆలోచనలను వికసింపజేసే మంచి పుస్తకాలపై వారికి అవగాహన కల్పించడమనే మాటే లేదు. ఎవరో ఒకరో ఇద్దరో మంచి పుస్తకాలను రచనల రూపంలో తెచ్చినా వాటికి ప్రోత్సాహమే కరువు అవుతోంది. ఓ ప్రముఖ సర్వే సంస్థ ఇటీవల వెల్లడించిన వివరాల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న యువతలో 85 శాతం మంది ఆయా కోర్సుల పుస్తకాలు తప్ప వేరే పుస్తకాలు చదవడమనేది తమకు తెలియదని చెప్పడం గమనార్హం. స్ఫూర్తి నింపే గాథలు, చరిత్రకు ప్రస్తుతానికి వారధిగా ఉండే పుస్తకాలు, మంచి కథనంతో ఉండే నవలలు ఇలా ఎన్నో ఉన్నప్పటికీ వాటి గురించి అసలు తమకు ఏమి తెలియదని యువత చెప్పడం మరింత ఆందోళనను కలిగిస్తోంది.

గ్రంథాలయాల సంగతయితే చెప్పక్కర్లేదు

లైబ్రరీల ఆలనాపాలనా చూడడం ఏళ్ల నుంచే దాదాపుగా పాలకులు మరిచిపోయారు. రోజు వారీ న్యూస్ పేపర్లు తప్ప మరే రకమైన పుస్తక కలెక్షన్లు అక్కడ కనబడవు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న దాదా పు 120 గ్రంథాలయా లకు ఒక్క పైసా నిధులు విదిల్చిన దాఖలాలు లేవు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసే దానిలో గ్రంథాలయ సెస్సు కూడా ఉంటుంది. వీటిని సదురు లైబ్రరీలకు జమ చేయడంలో మున్సిపాలిటీల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. దాదాపు రూ. 5.50 కోట్లు సెస్సు రూపంలో గ్రంథాలయాలకు రావాల్సిన బకాయిలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. పుస్తకం భవిష్యత్తులో బతికి బట్ట కట్టాలంటే ఆ ప్రయత్నం ముందుగా గ్రంథాలయాల నుంచే మొదలు కావల్సి ఉంటుంది. లైబ్రరీకు వచ్చే ప్రజలు, విద్యార్థులు ఎక్కువగా ఏ తరహా పుస్తకాలను చదవడానికి ఇష్టపడుతు న్నారు అనే అంశంతో పాటు.. గతంలో కన్నా ఇప్పుడు గ్రంథాలయాలకు వచ్చేవారి సంఖ్య తగ్గడానికి కారణాలేంటి అనే కోణంలో కూడా పరిశీలన చేయాల్సి ఉంది. కానీ, అలాంటి ప్రయత్నమేమి సదరు శాఖ వైపు నుంచి జరుగుతున్నట్లు కనబడడం లేదు. పుస్తకం దినత్సోవం రోజు మొక్కుబడిగా కార్యక్రమం చేసి మమ అనిపించడం తప్పితే చిత్తశుద్ధి కనబడడం లేదు. బాపట్లలో ఉన్న శాఖా గ్రంథాలయం అయితే దాదాపు శిథిలమయిన భవనంలోనే కొనసాగుతోంది. కొత్త నిర్మాణం ఊసేలేకపోగా గడచిన మూడేళ్ల వ్యవధిలో ఇక్కడ ఒక్కటంటే ఒక్క కొత్త పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చిన దాఖలాలే లేకపోవడం గమ నార్హం.

ప్రోత్సాహమే కరువు..ఇదో చక్కని ఉదహరణ

బాపట్లలోని ఏజీ కళాశాలలో చదువుకుని వివిధ రంగాలలో స్థిరపడిన వారి విజయగాథలతో ఓ నాలుగు పుస్తకాలను పూర్వ విద్యార్థులు అందుబాటులోకి తెచ్చారు. నిజానికి ఇవి ప్రస్తుతం ఇక్కడ విద్యనభ్యసించే విద్యార్థుల కు స్ఫూర్తినిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ, వీటికి సముచిత ప్రాధాన్యం ఇవ్వడంలో యూనివర్సిటీ పెద్దల నుంచి ప్రభుత్వాల వరకు నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ఈ పుస్తకాలను ఢిల్లీలోని లైబ్రరీల్లో ఉంచినా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రంథాలయాల్లో ఉంచాలన్న ఆలోచనే అటు యూనివర్సిటీ పెద్దలకు కానీ, ఇటు ప్రభుత్వానికి రాకపోవడం పుస్తకాలపై ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇదొక ఉదాహరణ మాత్రమే వెలుగులోకి రాని మంచి పుస్తకాలు వేలాదిగా ఉన్నాయి. వీటికి ప్రాధాన్యం ఇచ్చి ప్రచారం కల్పించడంలో వ్యవస్థల వైఫల్యం కూడా స్పష్టంగా కనబడుతోంది.

ప్లానిస్తే.. పాట్లే

(5వ పేజీ తరువాయి)

అధికారులు ప్లాన్ ఇచ్చేవారు. కొత్త నిబం.ధనల ప్రాకారం ఎల్‌టీపీ ప్లాన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సదరు అధికారులతో పని లేకుండా ప్లాన్ మంజూరు అవుతుంది. ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో దాఖలకు లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్స్ (ఎల్‌టీపీ)లకు ప్రభుత్వం పూర్తి అధికారాలు ఇచ్చింది. ఇంతవరకు బా గున్నా వారు అప్‌లోడు చేసిన ప్లాన్‌ను అతిక్రమించి భవనాన్ని నిర్మిస్తే అం దుకు ఎల్‌టీపీలను బాధ్యులను చేసింది. నిర్మాణదారుడు ప్లాన్‌ను ఉల్లం ఘించి భవనం నిర్మిస్తే తమ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఎల్‌టీపీల్లో ఆందోళన వ్యకమవుతోంది. కొత్తగా భవన నిర్మాణాలకు ప్లాన్లను దాఖలు చేసేందుకు ఎల్‌టీపీలు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే తప్పితే ఇప్పట్లో మున్సిపా లీట్లో ప్లాన్ల కోసం దరఖాసులు చేసే పరిస్థితులు లేవనే చెప్పాలి.

సరళం.. కఠినం

నిర్మాణ రంగంలో ప్లాన్ల మంజూరు నిబంధనలను మున్సిపల్ శాఖ సరళతరం చేసింది. ప్లాన్ కోసం పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల చుట్టూ నిర్మాణదారులు తిరగకుండా ఉండేలా వెసులుబాటు కల్పించింది. ఆన్‌లైన్‌లో ప్లాన్ నమోదు చేసి మున్సిపాల్టీకి ఫీజు చెల్లిస్తే అప్రూవల్ వస్తుంది. ఆపై నిర్మాణదారుడు వెంటనే ప్లాన్ ప్రకారం పనులు ప్రారంభించవచ్చు. అయితే ఏ కొద్ది పాటి అతిక్రమణ జరిగినా ఎల్‌టీపీలపై వేటు పడుతుంది. ఆరు నెలల పాటు వారిని బ్లాక్ లిస్టులో పెడతారు. పదేపదే ఇటువంటివి పునరావృతమైతే వారి లైసెన్స్ రద్దు చేస్తారు. ఈ నేపథ్యంలో ఎల్‌టీపీలు కొత్త ప్లాన్ల దరఖాస్తు చేయడాన్ని పూర్తిగా నిలిపివేశారు. తమపైనే వేటు పడే నిబంధనలను వారు వ్యతిరేకిస్తున్నారు. గతంలో ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టినా పది శాతం వరకు అతిక్రమించుకునే వెసులుబాటు కల్పించారు. తదుపరి రోజుల్లో మున్సిపాల్టీకి జరిమానా చెల్లించి క్రమబద్ధీకరిం చుకునే వారు. కొత్త నిబంధనలో ఆ వెసులుబాటు లేదు. నిబంధనలు అతిక్రమిస్తే భవన యాజమానులపై కాకుండా ఆన్‌లైన్‌లో ప్లాన్లు నమోదు చేసే తమపై చర్యలు ఉండటాన్ని ఎల్‌టీపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జీ ప్లస్-4కు గతంలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ పరిశీలించి ఆమోదం తెలిపేవారు. ఏమైనా అభ్యంతరాలుంటే మార్పు లు చేసి ప్లాన్ ఇచ్చేవారు. ఇప్పుడది ఉండదు. అంతా ఎల్‌టీపీలదే బాధ్యత. స్థలానికి సంబంధించి ఎవరైనా కేసులున్నట్లు ఫిర్యాదు చేస్తే సంబంధిత యజమానిపై, ప్లానర్‌పై కేసులు నమోదు చేస్తారు. పట్టణంలో 300 చదరపు మీటర్లలో భవన నిర్మాణం గతంలో చేసుకుంటే కొంత సడలింపు ఉండేది. మార్ట్‌గేజ్ ఉండటంతో చిన్న చిన్న తేడాలు ఉన్నా పెద్దగా పట్టించుకునేవారుకాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. కొత్త నిబంధనలు ప్రకారం నిబంధనలు అతిక్రమించారని గుర్తిస్తే వారిపై కేసులు నమోదు చేస్తారు. ఈ నిబంధనలకు సడలింపులు చేయకపోతే ప్లాన్ గీసే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● సహకార సంఘాల్లో అక్రమాలకు చెక్
● 236 సొసైటీలలో చురుగ్గా కంప్యూటరైజేషన్
● 229 పీఏసీఎస్‌ల్లోని రికార్డుల ఆన్‌లైన్ పూర్తి
● సంపూర్ణమవుతున్న ప్రక్రియ

సాంకేతిక సహకారం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అనేక అక్ర మాలకు, అవినీతికి ఆనవాలంగా మారిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పెను మార్పులు సంభవించాయి. ఇక మీదట తీవ్రమైన అవినీతి, అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండా సహకార సంఘాల చరిత్ర అంతా కంప్యూటరైజేషన్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ప్రక్రియ చాలా చురుగ్గా సాగింది. గతేడాది అక్టోబర్ 2న ప్రారంభమైన కంప్యూటరైజేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. ఉమ్మడి జిల్లాలో 236 సహకార సంఘాలు ఉండగా.. 229 సంఘాల్లోని రికార్డుల కంప్యూటరైజేషన్ చేశారు. ఇక విభజన జిల్లాల వారీగా చూస్తే.. గుంటూరు జిల్లాలో 64 సహకార సంఘాలు ఉండగా కేవలం ఒక్క చోట మాత్రమే కంప్యూటరైజేషన్ ఆలస్యం అవుతోంది. పల్నాడు జిల్లాలో 60 సహకార సంఘాలకు గాను ఒక్క చోట మాత్రమే కంప్యూటరైజేషన్ ప్రక్రియ మందగించింది. బాపట్లలో 112 సహకార సం ఘాలకు.. 107 సంఘాల్లో మాత్రమే ప్రక్రియ పూర్తి అయ్యింది. అక్కడ ఉ న్న ఏడు సహకార సంఘాల్లో కంప్యూటరైజేషన్ నత్తనడకన నడుస్తోంది.



గుట్టు రట్టు

ఇప్పటి వరకు సహకార సంఘాలు వేదికగా ప్రెసిడెంట్‌లు ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడేవారు. వారికి అనుగుణంగానే సొసైటీ సెక్రటరీలు ప్రవర్తించే వాళ్లు. అప్పటికప్పుడు రికార్డులు తారుమారు జరిగేవి. ఇటువంటి వ్యవహారంలో చాలామంది కోట్ల రూపాయలు వెన కేసిన ఉదంతాలు కూడా చాలా ఉన్నాయి. ఇన్ని అక్రమాలు జరగటానికి ప్రధాన కారణం లోపల ఏమి జరుగుతుందో బయటకు తెలియకపోవడం. కంప్యూటరైజేషన్ కాకముందు అసలు ఏ సొసైటీలో ఎంతమంది సభ్యులు ఉన్నారో.. వారిలో అసలు ఎంతమంది నకిలీ ఎందరో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు అటువంటి వాటికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. రికార్డులన్నీ కంప్యూటర్‌లో అందుబాటులో ఉంటాయి కాబట్టి ఏ సమాచారం అయినా మార్చటానికి అవకాశం ఉండదు. రుణాల మంజూరు, చెల్లింపు ప్రక్రియ ఆన్లైన్‌లో జరుగుతుంది కాబట్టి.. రాజకీయ నాయకుల ఆటలు సాగక పోవచ్చు అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నడింపాలెంలో ఈఎస్ఐకి ఉచితంగానే 6.35 ఎకరాల భూమి

● ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజక వర్గంలోని నడింపాలెం గ్రామంలోని సర్వే నంబరు. 110-02లో 6.35 ఎకరాల భూమిని ఈఎస్ఐ కార్పొరేషన్‌కి ఉచితంగానే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళశారం రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జీ జయలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థ నడింపాలెంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇందుకోసం ఆస్పత్రితో పాటు సిబ్బంది నివాసానికి భూమిని కేటాయించాల్సిందిగా రెవెన్యూ శాఖకి విజ్ఞప్తి చేసింది. తొలుత ఎకరం రూ. కోటి 69 లక్షల 53 వేల 148కి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కేంద్రం నుంచి వచ్చిన విజ్ఞప్తితో ఉచితంగా ఆ స్థలాన్ని ఈఎస్ఐసీకి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా గత వారం మంత్రివర్గం తీర్మానం చేయగా మంగళవారం అది కార్యరూపం దాల్చింది. త్వరలోనే ఆ భూమిని ఈఎస్ఐసీకి స్వాధీనం చేయనున్నట్లు రెవెన్యూవర్గాలు తెలిపాయి.

పొలానికే పరిమితం

పడిపోయిన బర్లి పొగాకు ధరలు
కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
పొలాల్లోనే పంట నిల్వ
ఆందోళనలో రైతులు

నాదెండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గతేడాది రైతులకు సిరులు పండించిన బర్లి(నల్ల) పొగాకు ఈ ఏడాది ఆందోళనకు గురిచేస్తోంది. దిగజారిన ధరలతో పాటు పొగాకును కొనేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదు. కొందరు రైతులు పండించిన పొగాకును భద్రపరుచుకొనేందుకు అవకాశం లేక పొలాల్లోనే పంటను ఉంచుకునే దుస్థితి నెలకొన్నది.

నాడు అలా.. నేడు ఇలా

గతేడాది రబీలో నాదెండ్ల మండలంతో పాటు ఇర్లపాడు, చిలకలూరిపేట మండలాల్లో నల్లబర్లి పొగాకును సుమారు వెయ్యి ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కాలం కలసి రావడం, దిగుబడులు దక్కడంతో పాటు క్వింటాకు రూ.15 వేలకు రైతులు విక్రయించారు. జీపీఐ, ఐటీసీలతో పాటు పలు పెద్ద కంపెనీలు పోటీలు పడి పొగాకును కొనుగోలు చేశాయి. ఈ క్రమంలో రైతులకు మంచి లాభాలు దక్కాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది చిలకలూరిపేట నియోజకవర్గంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో బర్లి పొగాకును సాగుచేశారు. గతంతో పోలిస్తే పొగాకు సాగుకు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. పది నుంచి 15 క్వింటాళ్ల వరకు ఈ ఏడాది దిగుడులు తగ్గాయి. ప్రస్తుతం ధరలు పరిశీలిస్తే అడుగు ఆకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలు, నాణ్యత గల ఆకు క్వింటా రూ.8 వేలు వరకు మాత్రమే వ్యాపారులు కొనేం దుకు సిద్ధమవుతున్నారు. ఐతే కొనుగోళ్లు మా త్రం ఇంత వరకు ఎవ్వరూ ప్రారంభించలేదు. దీంతో రైతులు పొలాల్లోనే పందిళ్లల్లో, పశువుల పాకల్లో పంటను భద్రపరుచుకుంటున్నారు. కాలం గడిచే కొద్ది నాణ్యత దెబ్బతిని రైతులు నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గణపవరం పొలాల్లో పందిరిపై ఉన్న బర్లి పొగాకు

ప్రభుత్వాలు ఆదుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారిస్తే పొగా కు రైతుకు న్యాయం జరుగుతుంది. మంత్రులు పొగాకు కంపెనీలతో మాట్లాడి.. రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. లేకుంటే రైతులు నష్ట పోవాల్సి వస్తుంది. భవిష్యత్‌లో బర్లి పొగాకు సాగుకు కంపెనీల నుంచి బాండ్లు ఇప్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

-తొండెపు సాంబయ్య, పొగాకు రైతు, గణపరం

ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్


సిద్ధమవుతున్న ప్రధాన వేదిక


అధికారులతో కలసి ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

తుళ్లూరు, (వెలగపూడి)ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో వివిధ అభివృద్ధి పనులకు భారత ప్రధాని నరేంద్రమోదీ మే 2న శంకుస్థాపన చేయనున్నారు. అందుకు వెలగపూడి రాష్ట్ర సచివాలయం దగ్గరిలో పడమరవైపు 200 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం గుంటూరు జిల్లా కెలెక్టర్ ఎస్.నాగక్ష్మి ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణం, రోడ్డు మార్గాలు, ప్రధాన వేదిక, పబ్లిక్, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు వద్ద ఏర్పాట్లను కలెక్టర్ సందర్శించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. ప్రధాని సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలా పనులను వేగవంతంగా చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఎం.నవీన్ కుమార్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ సుప్రజా, ఆర్డీవో కె. శ్రీనివాస రావు, అర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, సీఆర్డీఏ, రెవెన్యూ మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వసంత వికాసం.. వర్ణశోభితం

వసంతరుతువు పుష్ప వికాసం.. చూపరులకు మానసిక ప్రశాంతతను కలిగిస్తోంది. వృద్ధాప్యంతో రాలిపోయిన ఆకుల కొమ్మలకు.. విరబూసిన పూలు వర్ణశోభితంగా కనువిందు చేస్తున్నాయి. వినుకొండ నుంచి నరసరావుపేట జాతీయ రహదారి ఇరువైపులా గత టీడీపీ ప్రభుత్వం హయాంలో నాటిన మొక్కలు... పుష్పాలతో రంగులీనుతూ.. ఆకట్టుకుంటున్నాయి. బాటసారులతో పాటు ఉదయం, సాయంత్రం జాగింగ్‌కు వచ్చే వారికి ఉల్లాసాన్ని ఇస్తున్నాయి. జలజల పారే నీటి శబ్దాలకు హృదయం ఎలా స్పందిస్తుందో.. వికసించిన ఈ పుష్పాలను చూసిన వారు అలా మధురానుభూతి పొందుతున్నారు.

-వినుకొండటౌన్, ఆంధ్రజ్యోతి


సురేష్‌మహాల్ వద్ద జాతీయ రహదారి పక్కన..


రాజీవ్ ఫౌండేషన్ సమీపంలో వేసవిలో పూస్తున్న పుష్పాలు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి బదిలీ

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి టి.ప్రవళిక పిడుగురాళ్ళకు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ సివిల్ న్యాయాధికారులను 106మందిని బదిలీచేస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రకాశం జిల్లా ఒంగోలు మొబైల్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ సలోమి నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. బదిలీ అయిన న్యాయధికారులు మే నెల రెండో తేదీలోపు, ప్రస్తుత స్థానంలో రిలీవ్ అయి కొత్త స్థానంలో బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల సర్టిఫికెట్లు అందజేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వేసవి సెలవుల్లో వృత్తి విద్య కోర్సులు పూర్తిచేసిన 10వ తరగతి చెందిన 19మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు మంగళవారం అందచేశారు. 2024-25 సంవత్సరంలో ఎల్ఎన్‌జే, సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్తంగా నిర్వహించే వృత్తి విద్య శిక్షణలో భాగంగా పదో తరగతి చదివిన విద్యార్థులకు, కుట్టు, అల్లికలు, గుడ్డ తయారీపై ఇంటర్న్‌షిప్ పూర్తిచేశారు. వృత్తి విద్య కోర్సులతో విద్యార్థులు మేధాశక్తి పెంపొందించుకోవచ్చునని, స్వశక్తితో ఎదిగేందుకు దోహదపడుతాయని హెచ్ఎం అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు వృత్తి విద్య కోర్సులు కూడా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ టి.మహేష్, ఒకేషనల్ కోర్స్ ఉపాధ్యాయురాలు ఎం.లత పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి: తహసీల్దార్‌కు టీడీపీ నాయకుల వినతి

శావల్యాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొని ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఉత్తమమైన సేవలందించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు తహసీల్దార్ అర్జున్‌నాయక్‌ను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అర్జున్‌నాయక్‌ను టీడీపీ నాయకులు మంగళవారం కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షులు గడిపూడి విశ్వనాథం, వై. కోటేశ్వరరావు, జి.హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, సీనియర్ నేత బొల్లా పేరయ్య, యువనేత బి.నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

రావిపాడులో పోషణ్ పక్వాడ

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి), మండలంలోని రావిపాడు ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం 8వ తేదీ నుంచి 22వరకు ప్రతి కేంద్రం పరిధిలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ఉమారాణి పాల్గొన్నారు. ఆశిష్ స్వచ్ఛంద సేవా సంస్థ నుంచి మేలుకొలుపు టీం సభ్యులు హాజరై విటమిన్లు పోషకాహారం గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కేంద్ర పరిధిలోని హక్కుదారులందరూ పాల్గొన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ పోషణ అవసరాలు 1000 రోజుల సంరక్షణ గురించి వివరించారు. పలువురు ప్రాజెక్టు సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం నిర్వహించారు. నలగార్లపాడు, అన్నవరం, గోగులపాడు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆకుకూరలు, చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరు ధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శశిదేవి, దేవిబాయి, షమీమ్ సుల్తానా, ఆషా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంజీ హైస్కూలు వార్షికోత్సవం

చిలకలూరిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంజీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంస్థ ఎడ్యుకేషనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ రబ్బి పుత్రిన్ పాల్గొన్నారు. చదువులలో క్రీడలలో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్ బహూకరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం కె.కృపానందం, పీటర్, మణిదీపక్ పాల్గొన్నారు.

25న ఈపూరు సర్వసభ్య సమావేశం

ఈపూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఈపూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీన జరపనున్నట్లు ఎంపీడీవో కే ప్రభాకర్ తెలిపారు. వేసవికాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గ్రామాల్లోని పలు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా బొగ్గరం అమ్మవారి తిరునాళ్ల

ఈపూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గరంలోని శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. తిరునాళ్ల సందర్భంగా ఈపూరు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

○ తుప్పుపట్టి ఈదురు గాలులకు నేలకొరుగుతున్న పోల్స్
○ స్తంభాల నాణ్యతను పరిశీలించాలని ప్రజల వినతి


రెండు రోజుల క్రితం విరిగిన విద్యుత్ స్తంభం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులపై గతంలో మున్సిపల్ అధికారులు డివైడర్లపై ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. గతంలో నాణ్యత లేని స్తంభాలను ఏర్పాటుచేయటంతో కొన్నేళ్లకే స్తంభాల కింది భాగం తుప్పుపట్టి స్తంభాలు నేలకొరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం మార్కాపురం రోడ్డులోని ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో డివైడర్‌పై ఏర్పాటుచేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు ఈదురు గాలుల తాకిడికి నేలకొరగడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించడంతో పాటు విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను డివైడర్లపై ఉంచారు. ఇదిలా ఉండగా ప్రధాన రహదారులపై గతంలో ఏర్పాటు చేసిన స్తంభాలకు దిమ్మెలు విరిగిపోయి నేడో రేపో ఈదురు గాలుల తాకిడికి నేలకొరిగే ప్రమాదం పొంచిఉంది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్‌స్తంభాలను పరిశీలించి పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో చేరువ కావాలి

● పోలీస్‌స్టేషన్ల తనిఖీల్లో ఎస్పీ ఆదేశాలు


రిసెప్షన్‌లో ఉండే మహిళ కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులకు, సిబ్బందిని ఆదేశించారు. నరసరావుపేట మొదటి, రెండో పట్టణ పోలీస్ స్టేషన్లను మంగళవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీచేసి పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు ఫిర్యాదుదారులు వచ్చినప్పుడు ఎలా మెలగాలో రిసెప్షన్‌లో ఉండే మహిళ కానిస్టేబుళ్లకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్తి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. చోరీ కేసుల్లో ఆస్తి రికవరీలపై దృష్టి సారించాలన్నారు. కేసుల్లో సత్వరమే దర్యాప్తును పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌తో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. సమస్యలు ఉండే ప్రదేశాలను గుర్తించి బీట్లను పెంచి గస్తీ ముమ్మరం చేయాలన్నారు. మద్యం, ఇసుక, గంజాయి, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పోలీసుల సహకారంతో మహిళలపై జరుగుతున్న నేరాలు అరికట్టాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు, పోక్సో నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది పనితీరు, ఎఫ్ఐఆర్, కేసు డైరీ, రిజిస్టర్లు, విచారణలో ఉన్న కేసులో పురోగతి తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. విచారణలో ఉన్న కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పెండింగ్‌కు గల కారణాలు తెలుసుకుని వాటి విచారణ వేగవంతంగా చేయడానికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐలు ఎంవీ చరణ్, ఎం హైమారావు, ఎస్ఐలు వంశీకృష్ణ, ప్రియాంక, అశోక్ బాబు తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పారిశుధ్యం, ప్లాస్టిక్ వినియోగంపై కళాజాత

వినుకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం గ్రామ పంచాయతీల్లో కళాజాత బృందం ప్రజలకు పలు అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను, బాల్య వివాహాలు, పారిశుధ్యంపైన, తడి చెత్త, పొడిచెత్త, చెత్త నుంచి సంపద తయారు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై కళాజాత వివరించింది. ప్లాస్టిక్ కవర్లు మాని గోనె సంచులు, గుడ్డ సంచులు వాడాలని, ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి పది సంవత్సరాలు పడుతుందని, కాబట్టి ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. బాల్య వివాహాలు చేయవద్దని, ఆడపిల్లకు 18, మగపిల్లలకు 21 సంవత్సరాల వయసు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని పలు కథనాలతో నవ్విస్తూ అవగాహన కల్పించారు. క్యాక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీవాసరావు, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, కళాకారులు వెంకటలక్ష్మి, మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ, అంకమ్మ తల్లి తిరునాళ్ల

నాదెండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో పోలేరమ్మ, అంకమ్మతల్లి తిరునాళ్ళను మంగళవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమపూజ తదితర పూజలు నిర్వహించారు. అదే విధంగా దేవతామూర్తుల విగ్రహాలను గ్రామోత్సవం చేశారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు పలువురు చక్ర పొంగలి, పులిహోర, మజ్జిగ తదితరాలను పంపిణీ చేశారు. సద్ది నైవేద్యంగా అందజేశారు. జనసేన, వైసీపీల ఆధ్వర్యంలో ప్రభలు ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు

నూజెండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం శ్రీకోటకట్ల ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం నెల పొంగళ్లు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ప్రధాన అర్చకులు క్రోసూరు రామ్మోహనాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, తోమాల సేవ తదితర పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

సబ్సిడీ బ్యాంకు రుణాలపై అవగాహన

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లోని మంగళవారం జాయింట్ కలెక్టర్ ఘనోరే ఆధ్వర్యంలో కిసాన్ డ్రోన్లకు సంబంధించి ఎంపికైన రైతు సంఘాల ప్రతినిధులకు వ్యవసాయ శాఖ అధికారులకు ప్రతినిధులకు బ్యాంక్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ కిసాన్ డ్రోన్ల ఉపయోగాలు వాటి సబ్సిడీ తదితర అంశాలను వివరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజినెస్ మేనేజర్ సుమన్ మాట్లాడుతూ రుణ మంజూరు సబ్సిడీ తిరిగి చెల్లించవలసిన విధివిధానాలను వివరించారు. సమావేశం సంఘం కన్వీనర్లు వారి సందేహాలను బ్యాంక్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఘనోరే మాట్లాడుతూ 80% సబ్సిడీతో అందజేస్తున్న ఈ డ్రోన్‌ల సదుపాయాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు.

50శాతం రాయితీతో విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ

చిలకలూరిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు 50 శాతం రాయితీతో విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు, సీఆర్‌డీఏ సర్కిల్ సీనియర్ గణాంకాధికారి అజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమీపంలోని ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీస్, మీసేవ కేంద్రంలో గాని, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా కానీ కిలోవాట్‌కు తగిన చార్జీలు చెల్లించి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని వివరించారు. ఒక కిలోవాటు అదనపు లోడ్‌కు పాత ధర రూ.2,250 కాగా తగ్గింపు ధర రూ.1,250 మాత్రమేనని, రూ.1,000 రాయితీగా లభిస్తుందని పేర్కొన్నారు. గృహాలలోని ఆయా విద్యుత్ సర్వీసులకు అధిక లోడు ఉంటే తప్పనిసరిగా ఈ రాయితీని ఉపయోగించుకోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమములో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.అశోక్‌కుమార్, అసిస్టెంట్ గణాంకాధికారి చంద్రశేఖర్, ఏఈ లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


సాతులూరులో కరివేపాకు కారంపొడి తయారీ విధానాన్ని వివరిస్తున్న సీడీపీవో తదితరులు

మునగ ఆకుతో రక్తహీనత నివారణ: సీడీపీవో

నాదెండ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం తీసుకొనే ఆహారంలో మునగ ఆకును వినియోగిస్తే రక్తహీనతను నివారించవచ్చని నాదెండ్ల ఐసీడీఎస్ సీడీపీవో జీ శాంత కుమారి అన్నారు. మండలంలోని సాతులూరులోని సాతులూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, కిషోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ మునగాకు ఆహారంలో వినియోగం వల్ల క్యాల్షియం, ఐరన్ పుష్కలంగా లభిస్తుందన్నారు. ప్రతి ఇంటిలో మునగాకు చెట్టును పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మునగ, కరివేపాకు కారం పొడి తయారుచేసే విధానాన్ని నేర్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే.పద్మ, కార్యదర్శి మధుసూదనరావు, ఏఎన్ఎంలు, అఖిల, మల్లేశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ కాలనీలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి జన్మదిన వేడుకలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా, ఎంపీగా పురందేశ్వరి చేసిన సేవలకు ప్రజల మన్ననలను పొందారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎండ్లూరి వీరయ్య, శివాజీ వెంకయ్య, పత్తి మణికంఠ నాయుడు, రాంబాబు, అచ్చయ్య, వెంకటేశ్వర నాయక్, లక్ష్మీనారాయణ, యలమంద, సురభి మహేష్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు

● ఉపాధి హామీ నిధులతో నిర్మాణానికి ప్రణాళికలు
● సర్వేచేసి రెవెన్యూ శాఖ ఆమోదిస్తే తదుపరి చర్యలు



రొంపిచర్లలోని అంగన్‌వాడీ కేంద్రం

రొంపిచర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రొంపిచర్ల, మునమాక, విప్పర్ల సెక్టార్ల పరిధిలో 77 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 23 సొంత భవనాల్లో, 31 అద్దె భవనాల్లో, 23 ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మండలంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాలను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క భవనాన్ని కూడా నిర్మించలేదు. మరలా ప్రస్తుతం ఎనిమిది చోట్ల భవనాలు నిర్మించేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. దాతల సహకారంతో నాలుగు లేదా ఐదు సెంట్ల స్థలాలను సేకరించారు. సర్వే నెంబర్లతో సహా వీటిని సిద్ధం చేశారు. ఉపాధి హామీకి సంబంధించిన నిధులతో భవనాలను నిర్మించనున్నారు. ఐతే సర్వే నెంబర్లు పొందు పరిచిన వాటిని రెవెన్యూ శాఖ ఆమోదించాల్సి ఉంది. మాచవరం, విప్పర్ల, ఎడ్వర్డుపేట, కర్లకుంట, సుబ్బయ్యపాలెం, మునమాక, కొనకంచివారిపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో వీటి నిర్మాణాలను చేపట్టనున్నారు. రెవెన్యూ శాఖ త్వరితగతిన సర్వే చేసి ఆమోదం తెలిపితే భవన నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది.


రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రవి నాయక్

రెడ్డిపాలెం ఏపీ మోడల్ పాఠశాలలో ధరిత్రి దినోత్సవం

రొంపిచర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని మోడల్ పాఠశాలలో మంగళవారం ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవినాయక్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరక్షించుకోవచ్చన్నారు. వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో బ్రహ్మేశ్వరరావు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ వార్షిక తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

యడ్లపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండంలోని మైదవోలు-లింగారావుపాలెం గ్రామాల మధ్య ఉన్న గ్రామదేవత శ్రీపోలేరమ్మ అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టువస్త్రాలు, పూలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు గ్రామస్థులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. బంధువుల రాకతో ఇరుగ్రామాలలో సందడి నెలకొనడంతోపాటు, జనంతో వీధులు కళకళలాడాయి. నిర్వాహకులు తిరునాళ్లను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు.


పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

ఉత్సాహంగా కొనసాగుతున్న ఎడ్ల పోటీలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన సేద్యపు విభాగంలో మొత్తం 16జతలు పాల్గొనగా మొదటి బహుమతి కైవసం చేసుకునేందుకు ఎడ్లు హోరాహోరీగా పోటీపడుతున్నాయి. పోటీలను తిలకించేందుకు సమీప ప్రాంతంలోని ప్రకాశం జిల్లాతో పాటు పల్నాడు జిల్లా ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. పగలు ఎండ దృష్ట్యా సాయంత్రం నుంచి రాత్రి 12గంటల వరకు ఈ పోటీలు జరుగుతున్నాయి.

అన్నదానం


అన్నదానం చేస్తున్నమాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తదితరులు

వినుకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా జరుగుతున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు, 4వ రోజు మంగళవారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి మక్కెన చిన రామయ్య జ్ఞాపకార్థం రైతు సోదరులు, ప్రజలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిపాలెంలో పంట కోత ప్రయోగం


రెడ్డిపాలెంలో పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న శివ కుమారి, మస్తానమ్మ

రొంపిచర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో పంట కోత ప్రయోగాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉప సంచాలకులు శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రబీలో సాగు చేసిన ధాన్యం దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. వేసవి కాలంలో కూడా పొలాలను ఖాళీగా ఉంచకుండా మినుము, పెసర, నూగు వంటి పంటలను సాగు చేయాలన్నారు. పశువుల మేత భూమిలో మొక్కకు ఉపయోగ పడే ఖనిజాల లభ్యతకు మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు కోటమ్మ, రాజశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న గడ్డి దగ్ధం

యడ్లపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరులో తరలిస్తున్న గడ్డి విద్యుత్ తీగెలు తగిలి దగ్ధమైన ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో చోటుచేసుకుంది. యడ్లపాడు మండలం జగ్గాపురం గ్రామానికి చెందిన రత్తయ్య వ్యవసాయంతోపాటు ప్రతి ఏటా వేసవిలో పశుపోషకులకు వరిగడ్డిని సరఫరా చేస్తుంటాడు. ఈ ఏడాది కూడా గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టరుపై తెచ్చి చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కృష్ణాజిల్లా అవనిగడ్డలో వరిగడ్డిని కొనుగోలు చేసి యడ్లపాడులోని ఓ రైతుకు విక్రయించేందుకు తరలిస్తున్నాడు. యడ్లపాడు-జగ్గాపురం మార్గంలోకి ప్రవేశించిన ట్రాక్టరు రైస్‌మిల్లు సమీపంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగెలు గడ్డికి రాసుకుని మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై కొద్ది దూరంలో ఊరికి వెలుపల ఉన్న చవిటి చెరువు కట్టపైకి తీసుకెళ్ళి హైడ్రాలిక్ సాయంతో వరిగడ్డిని ట్రక్కు నుంచి గడ్డిని దించేశాడు. ట్రక్కుతో సహా ట్రాక్టర్‌ను అక్కడి నుంచి దూరంగా తరలించాడు. ప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.20వేలు విలువైన గడ్డి దగ్ధమైనట్లు బాధితుడు రత్తయ్య తెలిపాడు.